మెట్ట రైతుల కల సాకారమయ్యేనా?

మెట్ట రైతులకు వరప్రసాదినిగా మారిన కండలేరు ఎడమగట్టు కాలువ లైనింగ్ పనులు నిలిచిపోయాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.39.12 కోట్లతో పనులు చేపట్టగా 65 శాతం నిర్మాణాన్ని పూర్తి చేశారు. తరువాత ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. మిగిలిన పనులను కూడా పూర్తి చేస్తే చివరి ఆయకట్టు వరకు కాలువ ద్వారా సాగునీరు అందుతుందని రైతులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

- ఆగిన ఎడమగట్టు కాలువ లైనింగ్ నిర్మాణం
- గత ప్రభుత్వంలో రూ.39.12 కోట్లతో పనులు
- లైనింగ్ పూర్తయితే పెరగనున్న ఆయకట్టు విస్తీర్ణం
- మెట్టపల్లెల్లో పచ్చని పైర్లు


కండలేరు ఎడమగట్టు కాలువ హైలెవల్ స్లూయిజ్


కాలువకు చేసిన లైనింగ్ పనులు

పొదలకూరు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా జలయజ్ఞంలో కాలువ తవ్వేస్తే, తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా అదే కాలువకు లైనింగ్ పనుల కోసం నిధులు కేటాయించారు. మెట్ట పల్లెల్లో పచ్చని పైర్లు పండేందుకు తండ్రి తనయులు కృషి చేయడంతో రైతులు వారిని అక్కున చేర్చుకున్నారు. ఈ ప్రాంత రైతుల సమస్యలు, సాగునీటి కాలువల్లో నెలకొన్న ఇబ్బందులను అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేశారు. ఫలితంగా కండలేరు ఎడమగట్టు కాలువ లైనింగ్ పనుల కోసం రూ.39.12 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టారు. అయితే సుమారు 22 కి.మీ వరకు లైనింగ్ పనుల నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ పనులు పూర్తి చేస్తే రైతుల ఆయకట్టు విస్తీర్ణం పెరగడంతో పాటు, అసంపూర్తిగా ఉన్న ఉప కాలువల నిర్మాణం పూర్తవుతాయి. మరో 5 కి.మీ నిడివి ఉన్న లైనింగ్ పనులను పూర్తి చేస్తే చివరి ఆయకట్టు వరకు కాలువ ద్వారా సాగునీరు అందుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కాలువ పనులు పూర్తిస్థాయిలో చేపట్టేలోగా ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి.

జలయజ్ఞంలో కాలువ నిర్మాణం

రెండున్నర దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని కండలేరు ఎడమగట్టు కాలువ పనులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా 2005లో రూ.40 కోట్లను విడుదల చేసి పనులు పూర్తి చేయించారు. అయితే హైలెవల్ స్లూయిజ్ ద్వారా కాలువకు నీరు విడుదల కావాల్సి ఉండగా కండలేరు జలాశయంలో 35 టీఎంసీల నీటినిల్వ ఉంటేనే స్లూయిజ్‌కు నీరు అందుతుంది. ఇదే విషయాన్ని అప్పటి జెడ్పీచైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన ఎత్తిపోతల పథకం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అప్పట్లో సింగిల్ టెండర్ పడడంతో పనులు రద్దు చేయాల్సి వచ్చింది. తర్వాత లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో జాప్యం జరిగి తెలుగు రాష్ట్రాలు విడిపోయి టీడీపీ హయాంలో ఎత్తిపోతలను పూర్తి చేశారు. ఎడమగట్టు కాలువకు 27 కి.మీ నిడివితో 22 ఉప కాలువలు ఉన్నాయి. వీటి ద్వారా 38 చెరువులకు నీరు, డైరెక్టు ఆయకట్టు ద్వారా రైతుల భూములకు నీరు అందుతుంది. 20 వేల ఎకరాలకు సాగునీటిని అందించే అవకాశం ఉంది.

లైనింగ్ పనులతో రెట్టింపు ఆయకట్టు

కాలువ లైనింగ్ పనులు పూర్తయితే రెట్టింపు ఆయకట్టు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది. 20 వేల ఎకరాల ఆయకట్టు 45 వేల ఎకరాలకు పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాలువకు ప్రస్తుతం 350 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేసే సామర్థ్యం ఉండగా లైనింగ్ పనులు జరిగితే 455 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే వీలు ఉంటుంది. 2021 సెప్టెంబరులో పనులను ప్రారంభించి 65 శాతం పూర్తి చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినట్లుగా తెలుస్తోంది.

మిగిలిన పనులు పూర్తి చేయాలి



మిగిలిన ఉన్న లైనింగ్ పనులు పూర్తి చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చివరి ఆయకట్టు వరకు నీరు పారితే పంటలు పండించుకునేందుకు అవకాశం కలుగుతుంది. పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలి.
– ఎం.బాలకృష్ణారెడ్డి, ఎమ్పీటీసీ సభ్యుడు, కనుపర్తి

సాగునీటి ఇబ్బందులు ఉండవు



లైనింగ్ పనులు పూర్తయితే సాగునీటి ఇబ్బందులు తలెత్తవు. ప్రతి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఎన్నో ఏళ్లగా రైతుల కల సాకారం అవుతుంది. కండలేరు నిండితే గ్రావిటీ ద్వారా కాలువకు నీరు పారించేందుకు అవకాశం ఉంటుంది.
– వై.పెంచలరెడ్డి, రైతు, పులికల్లు

కాంట్రాక్టర్‌కు నోటీసులు

కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో పనులను నిలిపివేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు కూడా అందించాం.
– అనిల్‌కుమార్, ఈఈ, తెలుగుగంగ

క్లుప్తంగా

గణేశ్ లడ్డూ @ రూ.1.80 లక్షలు


లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న శ్రీకాంత్, పావని దంపతులు

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వడ్డిపాళెంలో గణేశ్ విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదానికి వేలంపాటను బుధవారం రాత్రి నిర్వహించారు. గ్రామానికి చెందిన గుంజి శ్రీకాంత్, పావని దంపతులు రూ.1.80 లక్షలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. గతేడాది నిర్వహించిన లడ్డూ వేలంపాటలో రూ.1.25 లక్షలు పలికింది. ప్రత్యేక పూజలనంతరం లడ్డూ ప్రసాదాన్ని గ్రామంలో పలువురు భక్తులకు పంచిపెట్టారు.

అభివృద్ధి పథంలో సహకార బ్యాంక్


మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

ఇందుకూరుపేట : మండలంలోని నిడిముసలి సహకార బ్యాంకు(పీఏసీఎస్) అభివృద్ధి పథంలో నడుస్తోందని బ్యాంక్ ఇన్‌చార్జి పర్సన్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బ్యాంకులో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకును త్వరలో కంప్యూటీకరణ చేస్తామని చెప్పారు. రైతులు ఆధార్, మొబైల్, పొలం సంబంధిత పత్రాలను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ ప్రతాప్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి కాకాణి నివాళి


రేణుకాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాకాణి

పొదలకూరు : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో చదువుకున్న వైఎస్సార్‌సీపీకి చెందిన రేణుకాదేవి ఇటీవల మరణించగా ఆమె దశదిన కర్మ బుధవారం చాటగొట్లలో జరిగింది. ఈ కార్యక్రమానికి కాకాణి హాజరై రేణుకాదేవి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని, తోడుగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. కాకాణి వెంట పార్టీ నేతలు నలగర్ల విజయభాస్కర్, గోగుల గోపాలయ్య, మండల వెంకటశేషయ్య ఉన్నారు.

గడ్డివామి దగ్ధం

పొదలకూరు : మండలంలోని కనుపర్తి గ్రామంలో గణేశ్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాణసంచా పేలుస్తున్న క్రమంలో గడ్డివామికి నిప్పంటుకుని దగ్ధమైంది. గ్రామస్తులు ఎస్సై హనీఫ్‌కు సమాచారం అందించడంతో వెంటనే ఆయన అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి గ్రామానికి రప్పించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్సై వివరించారు.

అపరిచితులు సంచరిస్తే తెలపండి


మాట్లాడుతున్న సీఐ రవినాయక్

ముత్తుకూరు : కృష్ణపట్నం పోర్టు, ఇతర ప్రాజెక్టులు, పరిశ్రమలు ఉన్నందు వల్ల ఎక్కడైనా అపరిచితులు సంచరిస్తున్నట్లు అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కృష్ణపట్నం సీఐ రవి నాయక్ విజ్ఞప్తి చేశారు. ముత్తుకూరులోని సర్కిల్ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కూడా పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. పోలీసులకు సహకారం అందించాలన్నారు. సర్కిల్ పరిధిలో వినాయకుని విగ్రహాల నిమజ్జనానికి మూడు చోట్ల ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ప్రదేశాల్లో పోలీసుల బందోబస్తు ఉందని వెల్లడించారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు



పొదలకూరు : మండలంలోని విరువూరు జెడ్పీహైస్కూల్లో 2023–24 విద్యా సంవత్సరంలో టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వర్లు బుధవారం నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీకి స్కెచ్ నిజం కాదా?

- వీడియో లీకై ఆధారాలు బహిర్గతం
- వైఎస్సార్‌సీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పొదలకూరు : టీడీపీ నేతలు సూరాయపాళెం ఇసుక రీచ్‌లో రూ.100 కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారని, అందుకు ఆధారంగా వీడియో కూడా బయటకు వచ్చిందని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ వల్లూరు గోపాల్‌రెడ్డి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సోమిరెడ్డి ఇసుక ద్వారా రూ.కోట్లు గడించాలని ప్రయత్నిస్తున్నట్లు గతంలో తాము చెప్పిన వాటిని ఆ వీడియో ద్వారా బలం చేకూరిందన్నారు. పొదలకూరులో లేఅవుట్ల ద్వారా ఇప్పటికే రూ.కోట్లు దండుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం ఉందన్నారు. టీడీపీ నాయకుల ఉడత బెదిరింపులకు భయపడేది లేదన్నారు. అక్రమ కేసులు పెడితే జైలుకు వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. దోపిడీని ప్రశ్నిస్తూనే ఉంటామని, అభివృద్ధి పనులు చేపడితే సహకరిస్తామన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతికి ఆమడ దూరంగా ఉంటారని, సర్వేపల్లిలో దోపిడీ జరిగితే ఉపేక్షించే ప్రశ్నేలేదన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటారని వారిలో మనోధైర్యం నింపేందుకే నిరంతరం పర్యటిస్తుంటారన్నారు. వల్లూరు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సెర్చ్‌వారెంట్ లేకుండా తన ఇంట్లో సోదాకు వచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కాకాణి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశానన్నారు. ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడేయడంతో కొన్ని వస్తువులు కనిపించకుండాపోయినట్లు భావించానని, తర్వాత పోలీస్ స్టేట్మెంట్‌లో నగలు పోలేదని వెల్లడించినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఎస్కే అంజాద్, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్కే ఖాదర్, వాకాటి శివారెడ్డి, ఎన్.శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, హరి పాల్గొన్నారు.

ఘనంగా రాధాష్టమి వేడుకలు



వెంకటాచలం : మండల కేంద్రమైన వెంకటాచలంలోని రాధేరాధే కృష్ణ మందిరంలో రాధాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాధా కృష్ణుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించిన అనంతరం పల్లకిసేవ గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మనోజ్ గుప్తా మాట్లాడుతూ జిల్లాలో రాధా కృష్ణుల మందిరం వెంకటాచలంలో మాత్రమే ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మందిర కమిటీ సభ్యులు చల్లా రమణయ్య, పుత్తూరు వెంకటరత్నం, వరదగల్లు హరిబాబు, మందిపాటి రమేష్, గజ్జల శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


మనుబోలు : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమణమ్మ

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణిలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని పిడూరుపాళెం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై గర్భిణులు, బాలింతలకు బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం సామూహిక సీమంతాలు జరిపించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాల తయారీని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడ్లు, పాలు, ఆకు కూరలు, తాజా కూరగాయలు, పండ్లు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు రాధా, సంపూర్ణమ్మ, రమణమ్మ, ఉమామహేశ్వరి, దొరసానమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనుపూరులో..

వెంకటాచలం : మండలంలోని కనుపూరు గ్రామంలో పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు తీసుకోవాల్సిన పోషకాహార పదార్థాలు, ఆరోగ్యపరమైన జాగ్రత్తల గురించి సీడీపీఓ విజయలక్ష్మి వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. అనంతరం గర్భిణులకు సీమంతాల చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శాంతిప్రియ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, వసంత, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

విడవలూరు : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు, చంటి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.రమణి అన్నారు. మండలంలోని ముదివర్తిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీసుకునే ఆహారంలో పండ్లు, ఆకు కూరలు అధిక మోతాదులో ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ లక్ష్మీరాజ్యం, ఏఎన్‌ఎంలు వెంకటరమణమ్మ, ప్రియాంక, అంగన్‌వాడీ టీచర్లు శారద, తిరుపతమ్మ, రాజసులోచనమ్మ, హేమలత, లావణ్య, శీనమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

ఇందుకూరుపేట : పిల్లలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుడి మంజుల అన్నారు. మండలంలోని మైపాడులో పోషకాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. బిడ్డకు బాలామృతం తప్పకుండా ఇవ్వాలని తెలిపారు.

ఆహారంలో పోషకాలు భాగం కావాలి

కొడవలూరు : పోషకాలు పుష్కలంగా ఉండే మునగ ఆకు, క్యారెట్, పండ్లు, పాలు, గుడ్లు, ఆకు కూరలు రోజువారీ ఆహారంలో భాగం కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో పోషకాహార విలువలపై గర్భిణులు, బాలింతలకు బుధవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషకాలుండే ఆహార పదార్థాలను వారంలో ఒక ట్రెండు రోజులు మాత్రమే తీసుకోవడం సరికాదన్నారు. ప్రతిరోజూ పోషకాలుండే ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను దూరం చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజన, ప్రమీల, రోజా, జానకి పాల్గొన్నారు.

నాయుడుపాళెంలో..

మండలంలోని నాయుడుపాళెంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాలను ప్రదర్శించి గర్భిణులు, బాలింతలకు బుధవారం అవగాహన కల్పించారు. ఎలాంటి ఆహారంలో పోషకాలు అధికంగా ఉంటాయో తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సునీత, పి.మధుసూదనమ్మ, ఎ.ఎస్తేరమ్మ, ఎ.అనూరాధ, ఆశా కార్యకర్త పి.సురేఖ, సహాయకురాలు జె.సుదర్శనమ్మ పాల్గొన్నారు.


విడవలూరు : ముదివర్తిలో..


వెంకటాచలం: కనుపూరులో సీమంతాలు చేయిస్తున్న అధికారులు


కొడవలూరు : రామన్నపాళెంలో..


ఇందుకూరుపేట: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మంజుల


కొడవలూరు : నాయుడుపాళెంలో..

బై.. బై.. గణపయ్య

కొడవలూరు : మండలంలో వినాయక నిమజ్జనాలు బుధవారం అత్యంత వేడుకగా నిర్వహించారు. యువకులు ఒకరికొకరు రంగులు చల్లుకొంటూ డీజే పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమాన్ని జరిపించారు. మండలంలోని ప్రతిమలను పైడేరు, మలిదేవి, తూర్పు కాలువల్లో నిమజ్జనం చేశారు. నార్తురాజుపాళెం గోల్డన్ నగర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు పోశింరెడ్డి కృష్ణారెడ్డి, ఏలూరు వెంకట నారపరెడ్డి, దాసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మోచర్ల వంశీకృష్ణారెడ్డి, చేవూరు వేణు యాదవ్, హనుమారెడ్డి రవీంద్రరెడ్డి, యారం చినబాబు, సయ్యద్ మునీర్‌ల ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. నార్తురాజుపాళెం దళితవాడలో అంబేద్కర్ యూత్ సభ్యులు మధు, రాజేష్, అఖిల్, దినేష్, శ్రీకాంత్, అజయ్, శ్రీహరి, చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో నిమజ్జన జరగ్గా, బసవాయపాళెం దళితవాడలో కమిటీ సభ్యులు వీరి హర్షవర్ధన్, సుబ్రహ్మణ్యం, ప్రతాప్, సురేంద్ర, మునునూరు సూరిబాబు, పవన్‌ల ఆధ్వర్యంలో జరిగింది.

- **మనుబోలు** : వినాయక చవితి సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహాలకు వైభవంగా నిమజ్జనోత్సవాలు నిర్వహిస్తున్నారు. మనుబోలులోని వివిధ మండపాల్లో కొలువుదీర్చిన బొజ్జ గణపయ్యలకు బుధవారం ప్రత్యేక పూజలు చేసి అనంతరం అట్టహాసంగా గ్రా మోత్సవం నిర్వహించి గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.
- **ముత్తుకూరు** : వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో బుధవారం నిమజ్జనానికి తరలించారు. మేళతాళాల నడుమ బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకొంటూ ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను కృష్ణపట్నం తీరంలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మదేవిలో అన్నదానం చేశారు. బీఎస్ కండ్రిగ నుంచి పండ్లు, కూరగాయలతో అలంకరించిన వినాయకుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


కొడవలూరు : నార్తురాజుపాళెం గోల్డన్ నగర్‌లో..


కొడవలూరు : నార్తురాజుపాళెం దళితవాడలో..


కొడవలూరు : బసవాయపాళెంలో..


మనుబోలు: పూజలందుకుంటున్న బొజ్జ గణపయ్య


ముత్తుకూరు : కూరగాయలు, పండ్లతో అలంకరించిన గణపయ్య

సెమీకాన్ లైవ్ వీక్షణ



వెంకటాచలం : సెమీకాన్ ఇండియా 2024 ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఢిల్లీలోని గ్రేటర్ నోయిడాలో జరిగింది. ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీలో ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత తదితరులు వీక్షించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగంలో సాంకేతికత, అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

ఆగని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు


రాగితీగలను దోచుకుని వదిలేసిన ట్రాన్స్‌ఫార్మర్

పొదలకూరు : మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు ఆగడం లేదు. పోలీసులు ఎంతగా నిఘా పెడుతున్నా దొంగలు ఏదో చోట తరచుగా చోరీలకు పాల్పడుతున్నారు. రెండురోజుల క్రితం మొగళ్లూరు పంచాయతీ గురవాయపాళెం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించారు. స్తంభానికి ఉన్న మినీ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి అందులో ఉన్న రాగితీగలను చోరీచేశారు. దీంతో రైతులు నిమ్మతోటలకు నీరు పారించుకునేందుకు విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని రైతులు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో వెంటనే ఆయన బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరులు ముఠాగా ఏర్పడి పగటి వేళల్లో గ్రామాల్లో తిరుగుతూ రాత్రివేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. గ్రామాలకు దూరంగా తోటలు ఉండడం వల్ల రైతులు గుర్తించలేకపోతున్నారు.